చకచకా ఇళ్ల నిర్మాణం

- పేదల సొంతింటి కల సాకారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- బిల్లులతో పాటు అన్ని విధాలా సహకరించారని లబ్ధిదారుల హర్షం

రొద్దం: ప్రతి పేదవాడి సొంతింటి కలను నిజం చేయాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 'పేదలందరికీ ఇళ్లు' పథకానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగానే ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు నిర్మాణాలకు అన్ని విధాలా అండగా ఉన్నారు. దీంతో ఇప్పటికే జగనన్న కాలనీల్లో ఎన్నో ఇళ్లు పూర్తి కాగా మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి.

7,552 గృహాల మంజూరు

పెనుకొండ నియోజకవర్గంలో జగనన్న కాలనీల ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. పలువురు లబ్ధిదారులు గృహ ప్రవేశాలకు సిద్ధమయ్యారు. సొంతింటి కల నెరవేరుతోందని లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో నిరుపేదలకు ప్రభుత్వం 7,552 వేల గృహాలు మంజూరు చేసింది. అందులో 2,707 గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన గృహాలు వివిధ దశల్లో ఉన్నాయి. బిల్లులు సకాలంలో మంజూరు చేస్తుండటంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చక చకా చేసుకుంటున్నారు. తురకలాపట్నం జగనన్న కాలనీల్లో ఇప్పటికే కొందరు లబ్ధిదారులు నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహ ప్రవేశాలకు రెడీ అయ్యారు. రొద్దంలో జగనన్న లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాలు వేగంగా సాగుతున్నాయి. తురకలాపట్నంలో 136 మందికి ఇళ్లు మంజూరు చేశారు.


రొద్దం మండలం తురకలాపట్నంలో చురుగ్గా సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు


తురకలాపట్నంలో పూర్తయిన ఇల్లు

- పరిగి మండలంలో ఐదు జగనన్న లేఅవుట్లలో 321 ఇళ్లు మంజూరు కాగా 15 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మిగిలిన వివిధ దశల్లో ఉన్నాయి.
- పెనుకొండ మండలంలో 2011 ఇళ్లు మంజూరు కాగా అందులో బీబీఎల్ 268, బిల్ 604, ఆర్ఎల్ 176, ఆర్‌సీ 35, పూర్తి అయినవి 927 ఉన్నాయి.
- సోమందేపల్లి 1468 ఇళ్లు మంజూరు కాగా 600 పూర్తయ్యాయి. 868 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి.
- రొద్దం మండలంలో 1,118 మంజూరు అయ్యాయి. 20 ఇళ్లు పూర్తయినట్లు ఏఈ ఖాజామైనుద్దీన్ చెప్పారు. 1098 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు.
- గోరంట్ల మండలంలో 2,634 మంజూరు కాగా అందులో 1160 పూర్తికాగా మిగిలిన వివిధ దశల్లో ఉన్నాయి.

సొంతింటి కల నెరవేరింది



ప్రభుత్వం సకాలంలో సహాయ సహకారాలు అందించడంతో ఇంటి నిర్మాణం పూర్తయింది. సొంత ఇంటి కల సాకారమవుతున్నందుకు ఎంతో సంతోషంగా ఉంది. ఇంటి నిర్మాణం పనుల బిల్లులుకూ సకాలంలో జమ చేశారు. త్వరలోనే సొంతింటిలోకి చేరబోతున్నాము.

– మారెక్క, తురకలాపట్నం

చాలా సంతోషంగా ఉంది



ప్రభుత్వం నాకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు మంజూరు చేసింది. కొత్త ఇల్లు నిర్మాణం చేస్తుంటే చాలా ఆనందంగా ఉంది. ప్రభుత్వం బిల్లులు కూడా సకాలంలో మంజూరు చేస్తోంది. నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా అన్ని సౌకార్యలు కల్పిస్తున్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ ఎప్పటికప్పుడు బిల్లులు అప్‌లోడ్ చేసి లబ్ధిదారులకు అన్ని విధాలు సాయం అందిస్తున్నారు.

– బోయ నరసమ్మ, తురకలాపట్నం

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



నేను కలలో కూడా సొంతింటిని నిర్మించుకుంటానని అనుకోలేదు. నా కలను నెరవేరుస్తున్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. పెనుకొండ-పావడగ ప్రధాన రహదారి పక్కనే ప్రభుత్వం ఇళ్ల స్థలాల కోసం భూమి కొనుగోలు చేసి ఒక్కొక్కరికీ రూ 5, నుంచి రూ.7 లక్షలు విలువ చేసే స్థలం ఉచితంగా అందించింది. అదేవిధంగా ఇల్లు కూడా మంజూరు చేసింది. హౌసింగ్ అధికారులు నిర్మాణంలో బాగా సహకరిస్తున్నారు.

– మమత, తురకలాపట్నం

వంతెన నిర్మాణానికి భూమి పూజ

హిందూపురం అర్బన్: మండల పరిధిలోని కిరికెర నుంచి నక్కలపల్లికి వెళ్లే రహదారిలో పెన్నానదిపై వంతెన నిర్మాణానికి ఆదివారం వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ పెన్నానదిపై వంతెన నిర్మించాలని స్థానికులు గత ప్రభుత్వానికి పలు మార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. అయితే ఈ విషయాన్ని ప్రజలు తన దృష్టికి తీసుకురావడంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఇందులో భాగంగానే కిరికెర నుంచి నక్కలపల్లికి వెళ్లేదారిలో వంతెన నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరు చేశారన్నారు. వంతెన నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి హనుమంతరెడ్డి, సర్పంచులు భాగ్యమ్మ, మూర్తి, ఆనంద్, దేవరాజ్, ఎంపీటీసీ సభ్యుడు ధనుంజయరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రాము, కోఆప్షన్ మెంబర్ చాంద్‌బాషా, ఉప సర్పంచ్ నరేంద్ర, వార్డు మెంబర్లు రమేష్, సుబ్బు, మంజునాథ్, వెంకట్, అనిల్ , బసిరెడ్డి, శ్రీరామిరెడ్డి, సాధిక్, తిప్పేరుద్రయ్య, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వంతెన నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

చిన్నారి ఆద్యకు ఘన నివాళి

హిందూపురం టౌన్: ద్విచక్ర వాహనదారుడి బాధ్యతారాహిత్యానికి ప్రాణాలు కోల్పోయిన చిన్నారి ఆద్య ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి ఘటించారు. స్థానిక సీఅండ్ఐజీ మిషన్ చర్చిలో సంఘస్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఆద్యకు నివాళులర్పించారు. ఈనెల 12న పట్టణంలోని పట్టుగూళ్ల మార్కెట్ రోడ్డులో ఓ యువకుడు బైక్‌పై అతివేగంగా నడిపి ప్రమాదానికి కారణం కావడంతో ఆద్య మృతి చెందింది. కార్యక్రమంలో లైఫ్ వరల్డ్ ట్రస్ట్ ప్రతినిధి ఉదయ్‌కుమార్, ఇస్సాక్ పాల్, మధుకర్, అనిల్ కుమార్, జోసెఫ్ లాజరస్, మనోజ్ జూలియట్, చందన్, మున్సిపల్ కోఆప్షన్ మెంబర్ కాంతమ్మ ఎస్తేర్ రాణి, టీనా తదితరులు పాల్గొన్నారు.

వివిధ సంఘాల ఆధ్వర్యంలో..

హిందూపురం: మున్సిపల్ ఆఫీసు సమీపంలోని మదర్‌థెరిసా విగ్రహం వద్ద ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి చిన్నారి ఆద్యకు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగేంద్రకుమార్, అరుణకుమారి తదతరులు పాల్గొన్నారు.


సీఅండ్ఐజీ మిషన్ చర్చిలో ఆద్యకు నివాళులర్పిస్తున్న దృశ్యం

నేడు శాంతి ర్యాలీ

చిన్నారి ఆద్య ఆత్మకు శాంతి చేకూరాలంటూ సోమవారం సాయంత్రం 6 గంటలకు పార్టీలకు అతీతంగా శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక తెలిపారు. కార్యక్రమంలో అన్ని పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

సహకార సంఘాలు ఎదగాలి

పావగడ: సహకార సంఘాలు సభ్యుల సహకారంతో ఉన్నత స్థాయికి ఎదగాలని వాల్మీకి సంజయ కుమార స్వామిజీ ఆకాంక్షించారు. తాలూకాలోని బెళ్లిబట్లు గ్రామంలో ఆదివారం నిర్వహించిన పాల ఉత్పత్తి సహకార సంఘం సర్వ సభ్య సమావేశంలో స్వామిజీ పాల్గొని మాట్లాడారు. స్థానిక పాల ఉత్పత్తి సహకార సంఘం ఎదుగుదలకు ఆ సంఘం అధ్యక్షుడు చంద్రోఖరరెడ్డి తదితర సభ్యులు ఎంతో సహకరిస్తున్నారన్నారు. అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ బెళ్లిబట్లు గ్రామం పాల ఉత్పత్తి సహకార సంఘం లాభాల బాటలో నడుస్తోందన్నారు. ఈసారి రూ.7 లక్షల ఆదాయం లభించిదన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం అభివృద్ధి అధికారి గురురాజ్, విస్తరణాధికారి సునీత, సీఈఓ శివణ్ణ తదితర పదాధికారులు, సభ్యులు పాల్గొన్నారు.


సభ లో పాల్గొన్న సంజయ కుమార స్వామీజీ

నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

సాక్షిబృందం: శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాల్లో ఆదివారం ఉదయం నుంచే అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో అమ్మవార్లను ముస్తాబు చేయడంతో భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు.


గోరంట్ల : బాలత్రిపుర సుందరి అలకరణలో చౌడేశ్వరీమాత


పెనుకొండ: అలంకరణలో వాసవీమాత


సోమందేపల్లి : గంధం అలంకరణలో కన్యకాపరమేశ్వరి


హిందూపురం: బాలత్రిపుర సుందరిగా మహాలక్ష్మిదేవి


హిందూపురం: సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో మహాకాళి అలంకరణ


హిందూపురం: గణపతి అలంకరణలో గంగమ్మదేవి


రొళ్ల : అలంకరణలో కొల్హాపురి మహాలక్ష్మీదేవి


అమరాపురం: ప్రత్యేక అలంకరణలో చోళమాంబదేవి


చిలమత్తూరు మండలం దేమకేతేపల్లిలో చౌడేశ్వరీదేవి

ముగిసిన ఉచిత కంటి వైద్య శిబిరం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు

పరిగి: కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్‌లో మైదానంలో 10 రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య పరీక్షలు, శస్త్ర చికిత్సలు ఆదివారం ముగిశాయి. జన సంకల్ప ఫౌండేషన్, శంకర్ నేత్రాలయ చెన్నై సంయుక్త సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ కంటి వైద్య నిపుణుల ఆధ్వర్యంలో దాదాపు వెయ్యి మంది వరకూ కంటి వైద్య పరీక్షలను నిర్వహించారు. 200 మందికి ఉచితంగా ఆపరేషన్లను నిర్వహించారు. ముగింపు కార్యక్రమాన్ని పురస్కరించుకుని పాఠశాల ఆడిటోరియంలో ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు అధ్యక్షతన ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల పూర్వ విద్యార్థి దాసరి ఆనంద్ ఆర్థిక సౌజన్యంతో దాదాపు రూ.20 లక్షల వ్యయంతో ఉచితంగా కంటి వైద్య పరీక్షలతో పాటూ శస్త్ర చికిత్సలను నిర్వహించినట్లు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ

రొద్దం: మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా వలిబాషా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంత్రి భద్రతలు పర్యవేక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

మందులతో మూర్ఛవ్యాధికి చెక్


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

హిందూపురం: క్రమం తప్పకుండ మందులు వాడుతూ జాగ్రత్తలు పాటిస్తే మూర్ఛవ్యాధిని నియంత్రించవచ్చునని జేవీవీ జిల్లా కార్యదర్శి డాక్టర్ ఈటి రామూర్తి అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఆల్‌హిలాల్ స్కూల్‌లో 119వ ఉచిత మూర్ఛవ్యాధి చికిత్స శిబిరం జరిగింది. వైద్య శిబిరంలో 159 మంది రోగులను పరీక్షలు చేసి రెండు నెలలకు సరిపడే మందులు ఉచితంగా అందించారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన


ఈసీజీ పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అమరాపురం: స్థానిక ప్రాథమిక మెయిన్ పాఠశాల ఆవరణలో ఆదివారం నవజాత శిశువు,, చిన్న పిల్లల వైద్యులు దినకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. 46 మంది చిన్న పిల్లలకు వైద్య సేవలందించి మందులను ఉచితంగా అందించారు. అలాగే 106 మంది రోగులకు కంటి పరీక్షలు చేయగా అందులో 38 మంది రోగులు కంటి శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. అలాగే 59 మంది రోగులకు గుండెకు సంబంధించిన పరీక్షలు నిర్వహించారు.

ట్రాక్టర్ - ద్విచక్ర వాహనం ఢీ

గోరంట్ల: స్థానిక రావికుంటచెరువు కట్టపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. శింగిరెడ్డిపల్లి వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్... గోరంట్ల వైపు నుంచి బూదిలికి వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని చెరువు కట్టమలుపు వద్ద ఢీకొంది. ఈ ఘటనలో బూదిలికి చెందిన నాగరాజు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు.

19న బైబిల్ పండుగ

పెనుకొండ: పట్టణంలోని బైబిల్ మిషన్ చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలకు సంబంధించి కరపత్రాలను చర్చి పాస్టర్ సుధాకర్, క్రైస్తవ సోదరులతో కలసి ఆదివారం విడుదల చేశారు. పాస్టర్ మాట్లాడుతూ బైబిల్ పండుగను పురస్కరించుకుని ఈ నెల 19న గురువారం ఉదయం 10 గంటలకు రెవరెండ్ శ్యామ్యూల్ కిరణ్ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయన్నారు.

రెడ్ల అభ్యున్నతికి కృషి

హిందూపురం: రెడ్డి సామాజిక వర్గంలో వెనుకబడిన వారి అభ్యున్నతికి, ఆర్థికాభివృద్ధికి కృషి చేయాలని రెడ్డి జేఏసీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పోచనపల్లిలో రెడ్డి జేఏసీ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రెడ్డి సామాజికవర్గం ప్రతినిధుల ఆత్మీయ సమావేశం జరిగింది. రెడ్డి సామాజిక వర్గం స్థితిగతులపై సర్వే నిర్వహిస్తామన్నారు.

క్లుప్తంగా

కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలి



రాష్ట్ర సదస్సులో మాట్లాడుతున్న నాయకులు

హిందూపురం టౌన్: నాన్ పీహెచ్ వర్కర్లకు కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు రంగ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక ఏఎంఎస్ ఫంక్షన్ హాలులో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మున్సిపల్ ఇంజనీరింగ్, ఇతర విభాగాల సిబ్బంది రాష్ట్ర సదస్సును నిర్వహించారు. సదస్సులో ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు వేమయ్య యాదవ్, ఆనందరాజు, రాష్ట్ర కార్యదర్శి రాజారెడ్డి, రాజేష్ గౌడ్, జాన్, వినోద్, సురేష్, అబ్బాస్, వేణు తదితరులు పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

పెనుకొండ రూరల్: అక్రమంగా మద్యం తరలిస్తున్న శెట్టిపల్లికి చెందిన నరేంద్ర అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు. 26 కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి నరేంద్రను రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో మెగా వైద్య శిబిరం


శిబిరంలో పాల్గొన్న రోగులు

రొద్దం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో ఆదివారం ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో, జేసీఎస్ కన్వీనర్ ఆర్‌పీ రవిశేఖర్‌రెడ్డి సహకారంతో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. మండల వ్యాప్తంగా వివిధ రోగులు పెద్ద ఎత్తున శిబిరానికి హాజరయ్యారు. వైద్య శిబిరంలో బెంగళూరు కావురి ఆస్పత్రికి చెందిన వైద్యులు గుండె జబ్బులు, గ్యాస్ట్రబుల్, హెర్నియా తదితర లక్షణాలు కలిగిన వారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. సమస్య ఉన్న వారిని కావేరీ ఆస్పత్రికి రేఫర్ చేసినట్లు డాక్టర్ చెప్పారు. వారికి బెంగళూరులో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ జీఎం శేఖర్, జిల్లా కార్యదర్శి జీబీ విశ్వనాథ్, కోఆర్డినేటర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్


మడకశిర: మండలంలోని జిల్లేడుగుంట వంకలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ లోకేష్ తెలిపారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఆదివారం అక్కడికి వెళ్లి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

పూర్తయిన డ్రైనేజీ నిర్మాణం



రొళ్ల: మండల కేంద్రంలోని మడకశిర ప్రధాన రోడ్డు కన్యకాపరమేశ్వరి ఆలయం సమీపంలో రోడ్డుపై చినుకు పడితే చాలు వర్షపు నీళ్లు నిల్వ ఉండి చెరువును తలపించేది. దీంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బంది పడేవారు. స్పందించిన స్థానిక సర్పంచ్ రామలక్ష్మమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రసన్నకుమార్ చొరవ తీసుకుని మండల పరిషత్ నిధులతో డ్రైనేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. బస్టాండ్ సమీపం నుంచి పట్టణ సమీపంలోని వంక కల్వర్టు వరకు 200 మీటర్ల మేర రూ.4.21 లక్షలతో డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తిచేశారు. దీంతో పట్టణ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

19న ఆలయ ప్రారంభోత్సవం


ప్రారంభానికి సిద్ధమైన కొల్లాపురమ్మ, మహేశ్వరిదేవి ఆలయం

మడకశిర: పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో నూతనంగా నిర్మించిన కొల్లాపురమ్మ, మహేశ్వరిదేవి ఆలయాన్ని ఈనెల 19, 20 తేదీల్లో ప్రారంభిస్తున్నట్లు వాల్మీకి సేవా సమితి, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగానే ఇంటింటికీ వెళ్లి ఆహ్వాన పత్రికలు అందజేశారు. పూజా కార్యక్రమాల్లో నిడగల్లు సంస్థాన వాల్మీకి ఆశ్రమ పీఠాధిపతి సంజయకుమారనందస్వామి పాల్గొంటారన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి


నారాయణరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

గోరంట్ల: మండలంలోని వాలనవోలు పంచాయతీ పరిధిలోని గుంటిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు నారాయణరెడ్డి అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ గుంటిపల్లికి చేరుకొని నారాయణరెడ్డి భౌతికకాయం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే కొలిమిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చంద్రాయుని భార్య గంగమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకరనారాయణ , పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు అక్కడికి చేరుకొని గంగమ్మ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అక్కడి నుంచి గోరంట్ల పట్టణంలోని రాజీవ్‌కాలనీకి చేరుకొని ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు చిరంజీవి వర్ధంతి వేడుకల్లో పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలసిన కళాకారులు


వినతిపత్రం అందిస్తున్న కళాకారులు

పెనుకొండ: ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణను ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం పలువురు కళాకారులు కలిశారు. గుర్తింపు కార్డులు, ఇళ్ల స్థలాలు, ఫించన్ మంజూరుపై వినతిపత్రం అందించారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడతామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కళాకారులు బాలసుబ్రహ్మణ్యం, ప్రభాకర్, మారుతి, శ్రీనివాసులు, గోపాల్, రామలింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీఎఫ్ నూతన కమిటీ ఎంపిక



వైఎస్సార్ టీఎఫ్ మండల కమిటీ సభ్యులతో జిల్లా కార్యవర్గ సభ్యులు

గోరంట్ల: స్థానిక ఎమ్మార్సీ భవన ఆవరణంలోని ప్రాథమిక పాఠశాలలో ఆదివారం జిల్లా వైఎస్సార్ టీఎఫ్ అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి కాడిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మండల నాయకుల సమావేశం జరిగింది. ఇందులో భాగంగానే మండల కమిటీ ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి, అధ్యక్షుడిగా సుభాష్‌నాయక్, ప్రధాన కార్యదర్శిగా వై సత్యనారాయణరెడ్డి , కోశాధికారిగా బయపరెడ్డి, ఉపాధ్యక్షులుగా నరసింహరెడ్డి, కాత్యాయని, పి.సుధాకర్‌నాయక్, జయచంద్రారెడ్డిను ఎన్నుకున్నారు. అలాగే కార్యదర్శులుగా వేణుగోపాల్‌రెడ్డి, కేశప్ప, సుకన్య, రాజశేఖరరెడ్డి, నిస్సార్‌అహమ్మద్, జిల్లా కౌన్సిలర్లుగా గంగిరెడ్డి, రాజారెడ్డి, ప్రభాకర్ నర్మద భాస్కరరెడ్డి, చెన్నమ్మ తదితరులను ఎంపిక చేశారు.

కలాంకు ఘన నివాళి


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెనుకొండ: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పట్టణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బహుజన చైతన్య వేదిక, మానవ హక్కుల కమిటీ నాయకులు విడివిడిగా కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఒక నిరుపేద కుటుంబంలో పుట్టి పేపర్‌బాయ్‌గా జీవితాన్ని కొనసాగించిన అబ్దుల్‌కలాం శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగతి సాధించి దేశానికి రాష్ట్రపతి అయ్యారని కొనియాడారు. నాయకులు రవూఫ్, రామకృష్ణ, రామాంజినేయులు, నరసింహులు, షమీవుల్లా, సూరి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.